RNI TITLE CODE: 16425 www.andhrapragathi.com

ప్రతి అక్షరం ప్రజాహితం

నేటి ఆంధ్రప్రగతి

తెలుగు దినపత్రిక

విలేకరులు కావలెను

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నుండి నూతనంగా ప్రారంభించబడి అత్యంత ప్రజాదరణ పొందుతున్న తెలుగు దినపత్రిక ఆంధ్రప్రగతిలో పనిచేసేందుకు ఉత్సాహవంతులైన పాత్రికేయులను ఆహ్వానిస్తున్నాము. జిల్లాల వారీగా స్టాఫ్ రిపోర్టర్లు, నియోజకవర్గ ఇన్‌చార్జ్‌లు, మండల రిపోర్టర్లు కావలెను. (కొత్తవారికి అవకాశం కల్పించబడును)

సెల్: 8121133006
9494220260

సంపుటి - 01 సంచిక - 329 పేజీలు - 04 వెల - 05/- శనివారం 10 ఆగష్టు 2024

# ఆదివాసీల జీవితాలలో వెలుగులు నింపుతూ..



## పేదరికం రూపుమాపుతాం.!



-ప్రపంచ ఆదివాసీ దినోత్సవంలో ముఖ్యమంత్రి
-గిరిజన మహిళలతో కలిసి థింసా నృత్యం

- డోలీ మోతలు కనబడటం బాధాకరం..ఆ పరిస్థితి మారుస్తాం.
- గిరిజన విద్యార్థుల కోసం విశాఖ, విజయవాడ, తిరుపతిలో స్టడీ సర్కిళ్ల ఏర్పాటు.
- గిరిజనుల అభివృద్ధి కోసం ఇకపై చైతన్యం 2.0 కార్యక్రమం.
- 2,191 గ్రామాలకు రోడ్ కనెక్టివిటీ కల్పిస్తాం.
- రూ.2,373 కోట్లతో ప్రతి గిరిజన కుటుంబానికి స్వచ్ఛమైన తాగునీరు.
- కూటమి ప్రభుత్వంలో వివక్ష ఉండదు...కక్ష సాధింపులుండవు.
- అరకు కాఫీతో పాటు ఆర్గానిక్ ఉత్పత్తులకు మరింత ప్రోత్సాహం.
- పాడేరులో మెడికల్ కాలేజీని రూ.500 కోట్లతో పూర్తి చేస్తాం.

2లో

## వైసీపీకి మరో గట్టి షాక్...
## ఆళ్ల నాని రాజీనామా.!

. వ్యక్తిగత కారణాలతో రాజీనామా చేస్తున్నట్లు ప్రకటన.
-జగన్ మంత్రివర్గంలో ఆరోగ్య శాఖ మంత్రిగా, డిప్యూటీ సీఎంగా పనిచేసిన ఆళ్ల నాని.



ఆంధ్ర ప్రగతి అమరావతి ఆగస్టు 09:
ఏపీలో వైసీపీకి వరుస షాక్‌లు తగులుతున్నాయి. ఆ పార్టీకి చెందిన పలువురు నేతలు రాజీనామా బాట పడుతున్నారు. పిఠాపురం మాజీ ఎమ్మెల్యే పెండెం దొరబాబు రాజీనామా చేసిన 48 గంటల్లో మరో మాజీ ఎమ్మెల్యే పార్టీకి గుడ్‌బై చెప్పారు.ఏలూరు జిల్లాకు చెందిన మాజీ డిప్యూటీ సీఎం ఆళ్ల కాళీకృష్ణ శ్రీనివాస్ (ఆళ్ల నాని) వైసీపీకి రాజీనామా చేశారు. వ్యక్తిగత కారణాలతో రాజీనామా చేస్తున్నట్లు తెలిపారు. ఏలూరు జిల్లా అధ్యక్ష పదవితో పాటు నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ పదవికి కూడా రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించారు. ఈ మేరకు పార్టీ అధినేత వైఎస్ జగన్‌కు రాజీనామా లేఖను పంపించారు. జగన్ మంత్రివర్గంలో ఆళ్ల నాని వైద్య ఆరోగ్యశాఖ మంత్రిగా, డిప్యూటీ సీఎంగా పనిచేశారు. అయితే, ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థి బడేటి రాధాకృష్ణయ్య చేతిలో ఓటమి పాలయ్యారు. అప్పటి నుంచి పార్టీ కార్యకలాపాలకు దూరంగా ఉంటున్నారు. ఇప్పుడు ఏకంగా పార్టీని వీడుతున్నట్లు ప్రకటించారు.

# రాష్ట్రంలో రెడ్ బుక్ రాజ్యాంగం నడుస్తోంది

### నంద్యాల జిల్లాలో వైసీపీ కార్యకర్త హత్య
### కార్యకర్త కుటుంబాన్ని పరామర్శించిన జగన్

- నాయకులకు కార్యకర్తలకు అండగా ఉంటా.!
- బాధితుల పక్షాన న్యాయం జరిగే వరకూ పోరాడుతాం.
- హత్య చేసిన, చేయించిన వారిని కఠినంగా శిక్షించాలి.



నంద్యాల ఆంధ్ర ప్రగతి ఆగస్టు 09: నంద్యాల జిల్లా మహానంది మండలం సీతారాంపురం గ్రామంలో ఈనెల 3వ తేది అర్ధరాత్రి దాటిన తర్వాత టీడీపీ నాయకుడు బుడ్డారెడ్డి శ్రీనివాసరెడ్డి మరియు అతని అనుచరులు అదే గ్రామానికి చెందిన పెద్ద సుబ్బరాయుడును దారుణంగా హత్యగావించిన ఘటనపై మాజీ సీఎం జగన్ నేడు బాధిత కుటుంబాన్ని పరామర్శించేందుకు వచ్చారు. గన్నవరం ఎయిర్పోర్ట్ నుండి ఓర్వకల్ కు చేరి అక్కడినుండి రోడ్డు మార్గం ద్వారా సీతారాంపురం గ్రామానికి మధ్యాహ్నం 1.30 గంటల ప్రాంతంలో చేకున్నారు. సుబ్బరాయుడు భార్య సుబ్బమ్మను మరియు కుటుంబ సభ్యులను పరామర్శించి ఘటన జరిగిన వివరాలను అడిగి తెలుసుకున్నారు. బాధితులకు పార్టీ ఎల్లప్పుడు తోడుగా అండగా ఉంటుందని ఎటువంటి భయాందోళన చెందవద్దని హామీ ఇచ్చారు.

మిగతా 2లో

## ప్రతి గ్రామంలో స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు
# ఘనంగా నిర్వహించాలి.!

-వేడుకల నిర్వహణకు పంచాయతీలకు నిధుల పెంపు.
-ఆగస్టు 15 కార్యక్రమాలకు రూ.100, రూ.250 ఇచ్చే మొత్తాలను రూ.10 వేలు, రూ.25 వేలకు పెంపు.
-ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్.



ఆంధ్ర ప్రగతి మంగళగిరి ఆగస్టు 09:
ప్రతీ గ్రామంలో స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించాలని... ఆనాడు నిర్వహించే కార్యక్రమాల నిర్వహణకు పంచాయతీలకు నిధుల కొరత లేకుండా తమ ప్రభుత్వం తగిన చర్యలు తీసుకుందని ఉప ముఖ్యమంత్రివర్యులు, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి పవన్ కళ్యాణ్ స్పష్టం చేశారు. పంచాయతీల్లో ఆగస్టు 15న వేడుకల నిర్వహణకు ఇచ్చే మొత్తాన్ని గణనీయంగా పెంచుతున్నామన్నారు. ఇప్పటి వరకూ మైనర్ పంచాయతీలకు రూ.100, మేజర్ పంచాయతీలకు రూ.250 ఇచ్చేవారు. ఇప్పుడు ఆ మొత్తాలను రూ.10 వేలు, రూ.25 వేలు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుందని పవన్ కళ్యాణ్ ప్రకటించారు.

మిగతా 2లో

# గ్రామ సచివాలయాల్లో రిజిస్ట్రేషన్ల విధానం రద్దు.!

-త్వరలో రిజిస్ట్రేషన్ విలువల పెంపు.
-రాష్ట్ర వ్యాప్తంగా రిజిస్ట్రేషన్ విలువలు పెంచే దిశగా ప్రభుత్వం అడుగులు వేస్తోంది.
-ఈ మేరకు సీఎం చంద్రబాబు సూత్రప్రాయంగా నిర్ణయం




2లో

## నాణ్యమైన విద్యాబోధనతో ప్రభుత్వ స్కూళ్లపై నమ్మకం పెంచాలి.!

-ప్రైవేటు స్కూళ్లకు ధీటుగా ప్రభుత్వ పాఠశాలలను తయారు చేయాలి.
-అన్ని స్కూళ్లలో ఇంటర్ నెట్ తప్పని సరిగా ఏర్పాటు చేయండి.
-సింఎంతో సహా అందరం మోడల్ పిటిఎం సమావేశాలకు హాజరవుతాం.
-గత ప్రభుత్వం వేలకోట్లు వెచ్చిస్తే 2లక్షలమంది విద్యార్థులు ఎలా తగ్గారు.?
-బాల్యం నుంచే మహిళలను గౌరవించేలా వచ్చే విద్యా సంవత్సరం నుంచి పాఠ్యాంశాల్లో మార్పులు.
-"సాల్ట్" ప్రాజెక్టుపై పాఠశాల విద్య అధికారులతో మంత్రి లోకేష్ సమీక్ష.



4లో

# ఆదివాసీల జీవితాలలో వెలుగులు నింపుతూ...!

ఆంధ్ర ప్రగతి అమరావతి ఆగస్టు 09:
గిరిజనులు పేదరికంలో పుట్టి పేదరికంలోనే చనిపోతున్నారు. పేదరికం లేని సమాజాన్ని మనం నిర్మించుకోవాలి. ఏ పని చేసినా పేదలను దృష్టిలో పెట్టుకోవాలి. ఆదివాసీల్లో పేదరికం ఎక్కువగా ఉంది...వారిని అన్ని విధాలా పైకి తీసుకొచ్చేందుకు నేను తప్పకుండా శ్రద్ధ తీసుకుంటా. రాబోయే ఐదేళ్లలో నిర్థిష్ట ప్రణాళికతో పేదరికాన్ని తగ్గిస్తాం. పేరుకు పథకాలు ఇవ్వడం కాదు...వాటి ఫలితాలు ఇచ్చేలా ఉండాలి. చేసే ప్రతి ఒక్క పనితో గిరిజనుల జీవన ప్రమాణాల్లో మార్పులు తీసుకొస్తాం. ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్ గురించి మాట్లాడుకుంటున్న ఈ రోజుల్లో డోలీ మోతలు కనబడటం చాలా బాధగా ఉంది. నేను రాజకీయ వివక్ష చూపించను...కక్ష సాధింపులకు పాల్పడను. కానీ రాష్ట్ర ప్రజల ఖజానాను, ఆస్తులను దోచిన వారిని శిక్షిస్తా. దోచిన సొమ్మును రికవరీ చేసి పేదలకు ఖర్చు పెడతా. ఈ రోజు నుండి చైతన్యం 2.0 ప్రారంభమైంది. ఈ 2.0 చైతన్యం ఎక్కడ పేదవాడుంటే అక్కడికొచ్చి మీకు కావాల్సిన వనరులు ఇచ్చి పేదరికం నుండి బయటకు తీసుకొస్తాం. మీ జివితాల్లో వెలుగులు రావాలని కోరుకుంటున్నానని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అన్నారు. విజయవాడలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో ఏర్పాటు చేసిన ప్రపంచ ఆదివాసీ దినోత్సవ కార్యక్రమంలో సీఎం పాల్గొన్నారు. ఆదివాసీలు పండించే ఉత్పత్తులు, తయారు చేసే కళాకృతులను పరిశీలించారు. అరకు కాఫీని తాగారు. స్వాతంత్రోద్యమంలో ఆదివాసీల పాత్ర, చరిత్రను తెలియజేసేలా రూపొందించిన ఫోటో ఎగ్జిబిషన్ ను తిలకించారు. ఆదివాసీ చీరను అడవి తల్లికి సమర్పించారు. అనంతరం ఆదివాసీలను ఉద్దేశించి సీఎం ప్రసంగించారు.

'ఇటీవల 16,347 పోస్టులతో మెగా డీఎస్సీ ప్రకటించాం. డీఎస్సీకి పోటీ పడే గిరిజన అభ్యర్థులకు ఉచితంగా శిక్షణ అందిస్తాం. గిరిజన విద్యార్థుల కోసం విశాఖ, విజయవాడ, తిరుపతిలో స్టడీ సర్కిళ్లు ఏర్పాటు చేస్తాం. ఆదివాసీల్లో అనేక కళలున్నాయి%ా%అరకు గిరిజన నృత్యం దేశంలోనే ప్రత్యేకమైంది. అనేక కళలున్న ఆదివాసీలు చాలా రంగాల్లో వెనకబడి ఉన్నారు. ప్రతి యేడాది ఆగస్టు 9న ప్రపంచ ఆదివాసీ దినోత్సవం నిర్వహించాలని ఐక్యరాజ్యసమితి సర్వసభ్య సమావేశంలో నిర్ణయించారు. ఆదివాసీ దినోత్సవాన్ని నిర్వహించాలని జీఓ నెంబర్ 123ను నాడు తెలుగుదేశం ప్రభుత్వంలోనే విడుదల చేసి నిర్వహించాం. కానీ గత ప్రభుత్వం ఆదివాసీ దినోత్సవాన్ని నిర్వహించడం మానేసింది. మన దేవానికి రాష్ట్రపతిగా ద్రౌపది ముర్మ ఉన్నారు, ఆమెను అందరూ స్ఫూర్తిగా తీసుకోవాలి. పాఠశాలలో ఉపాధ్యాయిరాలిగా పని చేస్తూ అంచెలంచెలుగా ఎదిగి రాష్ట్రపతి అయ్యారంటే అదీ ఆదివాసీల్లో ఉండే ప్రతిభ. ఆదివాసీలు అనగానే శౌర్యం, ప్రతిభ, నైపుణ్యం కలిగి ఉంటారు. ప్రకృతిని ఆరాధిస్తారు. ఎగ్జిబిషన్ లో ఏకలవ్యుడి ఫోటోలు చూశాను. గిరిజన కుటుంబంలో పుట్టాడు. విలువిద్యను అందించేందుకు గురువులు నిరాకరిస్తే పట్టుదలతో విద్యనభ్యసించి అందరికీ ఆదర్శంగా నిలిచారు. అలాంటి వ్యక్తి గిరజనుల్లో పుట్టుడం అదృష్టం. వ్యవసాయం, హస్తకళలు, నృత్యం, సంప్రదాయ ఆహారాలను గిరిజనులు పాటిస్తున్నారు. వాటిద్వారా అభివృద్ధికి ఎక్కువ అవకాశాలు ఉన్నాయి. స్వాతంత్ర్యం పోరాటంలో ఆదివాసీలు పెద్దఎత్తున పోరాడారు. బిర్సాముండా, తాత్యాబిల్, మన తెలుగువారైన కొమరం భీం లాంటి వాళ్లు బ్రిటిష్ వారి గుండెల్లో రైళ్లు పరిగెత్తించారు. అల్లూరి సీతారామరాజు మీ అండతోనే బ్రిటిష్ వారి ఆధిపత్యాన్ని అంతం చేయడానికి పోరాడి ప్రాణత్యాగం చేశారు. అందుకే దేశానికే ముద్దబిడ్డగా మిలిగిలారు. మీ త్యాగాలు, మీ మద్దతు జాతి మరవదు. దేశంలో 10.42 కోట్ల మంది గిరిజనులున్నారు. రాష్ట్రంలో 5.56 శాత మంది ఉన్నారు.' అని సీఎం వివరించారు.

'మీలో అనేక కట్టుబాట్లు ఉన్నాయి. మైదానంలో ఉండే వారి జీవన ప్రమాణాలు తక్కువగా ఉన్నాయి...ఏజన్సీలో ఉండే వారికి కనీసం రోడ్లు కూడా సరిగా లేవు. సమైఖ్య రాష్ట్రంలో చైతన్యం అనే కార్యక్రమం పెట్టి పెనుమార్పులకు శ్రీకారం చుట్టాం. మైదాన ప్రాంతాల్లో ఉండేవారి కంటే ఏజన్సీలో ఉండేవారికి వనరులు ఎక్కువ అందుబాటులో ఉంటాయి. అరకు కాఫీని ప్రమోట్ చేశాం. అభివృద్ధి చేయడానికి ఉన్న అవకాశాలను అందింపుచ్చుకున్నాం. చాలామంది అర్గానిక్ ఆహార ఉత్పత్తులను పండిస్తున్నారు. ఎక్కడా దొరకని తేనె మన ప్రాంతాల్లో దొరుకుతోంది. కాఫీకి ప్రాధాన్యం ఇవ్వడమే కాకుండా వ్యాపారంలో ముందుకు తీసుకెళ్లడంతో పాటు సాగును ప్రోత్సహించాం. ప్యారిస్ లో కూడా ప్రస్తుతం అరకు కాఫీ అమ్ముతున్నారు. కొన్ని పెద్ద పత్రికలు కూడా అరకు కాఫీ గురించి రాస్తున్నాయి. వ్యవసాయంలో అరకు కాఫీ కూడా భాగమని కథనాలు రాస్తున్నాయి. ప్రధాని నరేంద్రమోడీ కూడా గతంలో అరకు కాఫీకి బ్రాండ్ అంబాసిడర్ గా ఉన్నారు. ఆదివాసీల మహిళలు డ్వాక్రా సంఘాల్లో కూడా ఉన్నారు. పేద మహిళలను సంఘటిత శక్తిగా మార్చాలని నాడు ఆలోచించాను. మారుమూల ప్రాంతాల్లోని ఆడబిడ్డలు చేసే కుల, చేతివృత్తులను ప్రోత్సహించాం. మల్టీ గ్రెయిన్ బిస్కెట్ల తయారీని ప్రోత్సహించాం. ఏ పని చేసినా అనునిత్యం సాధన చేస్తూ నైపుణ్యం పెంచుకుంటే ఆదాయం వస్తుంది. కానీ ప్రభుత్వం నుండి అధారం లేకపోవడంతో దెబ్బతిన్నారు. ఆదివాసీలు ఎందుకు వెనకబడి ఉన్నారో అధ్యయనం చేస్తున్నా'నని అన్నారు.

'స్వాతంత్ర్యం వచ్చి 78 ఏళ్లైంది. చాలా వర్గాలు అభివృద్ధి చెంది ముందుకెళ్తున్నాయి. కానీ ఎస్సీ, ఎస్టీ, బీసీలు ఆర్థికంగా వెనకబడి ఉన్నారు. ఆదివాసీల్లో పుట్టిన పిల్లలతో పాటు తల్లులు కూడా చనిపోతున్నారు. ఈ సంఖ్యను తగ్గించాలి. పిల్లల సంఖ్య తగ్గితే వృద్ధుల సంఖ్య పెరుగుతుంది. మన పిల్లలే మనకు ఆస్తి. వారిని బాగా చదివిస్తే మనం కష్టంలో ఉన్నప్పుడు చూసుకుంటారు. దేశంలో తలసరి ఆదాయం రూ.1.72 లక్షలు ఉంటే ఏపీలో రూ. 2.20 లక్షలు ఉంది. కానీ ఆదివాసీల్లో రూ.1.20 లక్షలే ఉంది. పేదల జీవన ప్రమాణాలపై శ్రద్ధ పెడతాం. అన్ని విధాలా పైకి తీసుకొస్తాం. తెలుగుదేశం పార్టీ హయాంలో 16 పథకాలు తీసుకొచ్చాం. 199 గురుకులాలు తీసుకొచ్చాం. 2,705 విద్యాసంస్థల్లో ప్రస్తుతం 2,45,380 మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. ఆదివాసీల్లో విద్యాభ్యాసం తక్కువగా ఉందని ఆలోచించిన ఎన్టీఆర్ ఏ ఊరిలో స్కూలు కావాలంటే ఆ ఊరిలోనే స్కూలు నిర్మించారు. గురుకుల పాఠశాలలు తీసుకొచ్చారు. గిరిజన ప్రాంతాల్లో గిరిజనులే ఉపాధ్యాయులుగా ఉండాలని చెప్పిన వ్యక్తి ఎన్టీఆర్. మీ పిల్లల విద్య కోసం 2014-19లో రూ.450 కోట్లు ఖర్చు చేస్తే గత ప్రభుత్వం సగం కూడా ఖర్చు చేయలేదు. గిరిజన పిల్లలు అటవీ ప్రాంతాలకు పరిమితం కాకూడదని ఐఏఎస్, ఐఐఎంలలో చదవాలని శ్రద్ధ పెట్టాం. సివిల్ సర్వీస్ కోచింగ్ కు వెళ్లేందుకు 1000 మందికి రూ.13 కోట్లు ఖర్చు చేశాం. కానీ గత ప్రభుత్వం రూ.3 లక్షలు మాత్రమే ఖర్చు పెట్టి ముగ్గురికే ట్రైనింగ్ ఇచ్చింది. గిరిజనుల్లో ప్రతిభ ఉంది...దాన్ని సానబెట్టి బయటకు తీయాలి. అంబేద్కర్ ఓవర్సీస్ విద్యా విధానాన్ని ప్రవేశపెట్టి విదేశాల్లో చదువుకునేందుకు రూ.15 లక్షల చొప్పున సాయం అందించి 55 మందిని విదేశాలకు పంపాం. దీనికోసం రూ.7.5 కోట్లు ఖర్చు పెట్టాం. కానీ గత ప్రభుత్వం అంబేద్కర్ పేరు తొలగించి జగన్ పేరు పెట్టుకుని ఒక్కరికి మాత్రమే విదేశీ విద్యను అందించింది. బెస్ట్ అవైలబుల్ స్కూళ్లు, కార్పొరేట్ స్కూళ్లలో చదువించుకునేవారి కోసం ప్రభుత్వం నుండి ఫీజులు చెల్లించాం. గిరిపుత్రిక కింద 9,222 మంది గిరిజన యువతులకు రూ.56 కోట్లు పెళ్లికానుక అందించాం. దాన్ని కూడా గత ప్రభుత్వం నీరుగార్చింది. గిరిజనులు చనిపోతే రూ.5 లక్షలు ఆర్థిక సాయం బీమా ద్వారా అందించాం. రహదారి సదుపాయం లేని ప్రాంతాల నుండి ఆసుపత్రులకు డోలీల్లో వెళు న్నారని గుర్తించి ఫీడర్ అంబులెన్సులు తీసుకొచ్చాం. కానీ గత ప్రభుత్వం వాటిని కూడా నిర్వీర్యం చేయడంతో మళ్లీ డోలీల్లో మొసుకొచ్చే పరిస్థితికి తీసుకొచ్చింది. డోలీల్లో తీసుకొచ్చే సమయంలో ప్రసవం అవుతున్నారంటే ఏంటి ఈ దౌర్భాగ్యం.? ఆధునిక యుగంలో ఉన్నాం...అయినా డోలీల్లో తీసుకొస్తున్నారంటే అందరూ బాధపడాలి. ఆసుపత్రుల్లో ప్రసవాలు జరిగితే మాతా,శిశు మరణాలు తగ్గుతాయి. సరైన పౌష్టికాహారం అందించేందుకు బాలింతలు, పిల్లలకు ఫుడ్ బాస్కెట్ ప్రవేశపెట్టాం. దోమల బెడద నుండి తప్పించుకోవడానికి దోమ తెరలు అందించాం. ట్రైకార్ ద్వారా ఉపాధి, భూమి కొనుగోలుకు రూ.685 కోట్లు ఖర్చు చేశాం. గిరిజన ప్రాంతాల్లో మొబైల్ టవర్లు ఏర్పాటు చేశాం. మేము ఉచితంగా కరెంట్ ఇస్తే దాన్ని కూడా గత ప్రభుత్వం రద్దు చేశారు. బ్లాక్లైట్ తవ్వకాలు నిలిపేస్తే లేట్ రైట్ పేరుతో తవ్వకాలు చేశారు' అని సీఎం చంద్రబాబు ధ్వజమెత్తారు.

' మీ భూములు దోచుకునేందుకు గత ప్రభుత్వం తెచ్చిన చట్టాన్ని రద్దు చేశాం.ఆదివాసీ దినోత్సవం సందర్భంగా మీకు శుభాకాంక్షలు తెలపడమే కాదు...నిర్దిష్ట ప్రణాలికతో అభివృద్ధి చేస్తాం. అరకు పార్లమెంట్ పరిధిలో 5 స్థానాల్లో కూటమి అభ్యర్థులను గెలిపించారు. మంచి పనులు జరగాలంటే ఆలోచనా విధానం కూడా మారాలి. మొన్నటి ఎన్నికల్లో సుడిగాలి వచ్చింది...ఆ సుడిగాలిలో తిరిగి రానంతగా జగన్ కొట్టుకుపోయారు. దీనికి కారణం అవినీతి, దోపిడీ, పేదల పొట్టకొట్టే పాలకులు ఉండటమే. ఇక్కడుండే వారిని అడుగుతున్నా....గత ప్రభుత్వంలో ఎవరికైనా న్యాయం జరిగిందా.? మీకు ఒక్క రుణమైనా ఇచ్చిందా.? మీ పిల్లల భవిష్యత్తు ను నిర్వీర్యం చేశారు. గిరిజనులపై దౌర్జన్యాలు చేసి కేసులు పెట్టారు. అందుకే నిశ్వబ్ధ విప్లవం వచ్చి ఎవరూ ఊహించని విధంగా 93 శాతం స్థానాలు కూటమికి వచ్చాయి. మీరు అనేక కష్టాలు అనుభవించారు. వైసీపీ ప్రభుత్వం రూ.10 లక్షల కోట్లు అప్పులు చేసింది..వాటికి ప్రతి నెలా వడ్డీలు కట్టాలి. ఇప్పటికే కొన్ని పథకాలు అమలు చేస్తున్నాం. ఎన్నికల ముందు చెప్పిన విధంగానే పింఛను రూ.3 వేల నుండి రూ.4 వేలకు పెంచి పెద్దకొడుకుగా ఉన్నా. వాలంటీర్ల లేకుంటే పింఛన్లు ఇవ్వలేరని చెప్పి 35 మంది వృద్ధుల ప్రాణాలు తీశారు. కానీ మనం ఒక్కరోజులోనే 97 శాతం మందికి పింఛన్లు అందించాం. అసాధ్యాన్ని సుసాధ్యం చేసే శక్తి తెలుగుదేశం పార్టీకి ఉంది. ఆగస్టు 15న అన్నా క్యాంటీన్లు ప్రారంభిస్తున్నాం. రానున్న రోజుల్లో గిరిజన ప్రాంతాల్లోని అన్ని మండలాల్లో అన్నా క్యాంటీన్లు ఏర్పాటు చేస్తాం. ల్యాండ్ టైట్లింగ్ యాక్టు ద్వారా మీ భూములను దోచుకోవాలని చూశారు. అందుకే ఆ చట్టాన్ని రద్దు చేశాం.' అని సీఎం స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంక్షేమ శాఖా మంత్రి గుమ్మడి సంధ్యారాణి, ఎమ్మెల్యేలు అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## గ్రామ సచివాలయాల్లో రిజిస్ట్రేషన్ల విధానం రద్దు.!

ఆంధ్ర ప్రగతి అమరావతి ఆగస్టు 09:
రిజిస్ట్రేషన్ల శాఖపై సమీక్షలో ముఖ్యమంత్రి చంద్రబాబు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా రిజిస్ట్రేషన్ విలువలను త్వరలో పెంచేందుకు సూత్రప్రాయంగా నిర్ణయించారు. కనిష్ఠంగా 10 శాతం నుంచి గరిష్ఠంగా 20 శాతం వరకు రిజిస్ట్రేషన్ విలువలు పెంచనున్నారు. సాధ్యమైనంత వరకు 10 శాతం నుంచి 15 శాతం మధ్యనే పెంపుదల ఉండొచ్చు.

శాస్త్రీయంగా అధ్యయనం చేశాకే ప్రాంతాలవారీగా రిజిస్ట్రేషన్ విలువల పెంపుపై నిర్ణయాలు జరుగుతాయి. ఈ ప్రక్రియకు కనీసం 45 రోజుల సమయం పడుతుంది. పెంపు ప్రతిపాదనలను సీఎం చంద్రబాబుకు అధికారులు నివేదించాక అధికారిక నిర్ణయం వెలువడుతుంది. ప్రస్తుతం కొన్నిచోట్ల రిజిస్ట్రేషన్ విలువలు ఎక్కువగాను, బహిరంగ మార్కెట్ విలువను తక్కువగాను ఉన్నాయి. వీటిని సరిదిద్దుతారు. వాస్తవానికి పట్టణ ప్రాంతాల్లో ఏటా ఆగస్టు 1న, గ్రామీణ ప్రాంతాల్లో రెండేళ్లకోసారి రిజిస్ట్రేషన్ విలువలు పెంచుతారు. వైఎస్సార్సీపీ పాలనలో 2019లో పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో 10 నుంచి 20 శాతం అలాగే 2020లో ఎంపిక చేసిన పట్టణాల్లో 10 నుంచి 20 శాతం, 2022లో జిల్లా కేంద్రాల్లో 20 శాతం, 2023లో జాతీయ రహదారులు, ఎంపిక చేసిన ప్రదేశాల్లో 20 శాతం వరకు విలువలు పెంచారు. నివేదికలు అందిన తర్వాత సీఎం చంద్రబాబు ఆమోదం తెలిపిన మేరకు రిజిస్ట్రేషన్ విసువల పెంపునకు అనుగుణంగా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై జిల్లాలకు ఆదేశాలు వెళ్తాయి. గ్రామ సచివాలయాల్లో వైఎస్సార్సీపీ ప్రభుత్వం ప్రవేశపెట్టిన రిజిస్ట్రేషన్ల విధానం రద్దుకు చంద్రబాబు ఆమోదం తెలిపారు. ఈ విధానానికి క్రయ, విక్రయదారుల నుంచి స్పందన తక్కువగా ఉంది. గడిచిన రెండేళ్లలో సుమారు 3 వేల 700 గ్రామ సచివాలయాల్లో ఈ విధానం ప్రారంభించగా ఇప్పటివరకూ 5 వేల రిజిస్ట్రేషన్లే జరిగాయి. వీటి వల్ల అదనంగా ఖర్చు, మానవ వనరుల వృథాతో పాటు సాంకేతిక సమస్యలు ఉన్నాయని అధికారులు సీఎంకు నివేదించారు. ఎంపిక చేసిన సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలను కార్పొరేట్ స్థాయిలో తీర్చిదిద్దే విధానానికి చంద్రబాబు స్వస్తి పలికారు. ప్రస్తుతం ఉన్న సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో క్రయ, విక్రయదారులకు అవసరమైన మౌలిక సదుపాయాలను మెరుగుపరచాలని అధికారులను ఆదేశించారు. ఇందుకు 10 కోట్ల రూపాయలు అవసరమని ఐజీ శేషగిరిబాబు ప్రతిపాదించగా నిధుల విడుదలకు సీఎం అంగీకారం తెలిపారు.

## రాష్ట్రంలో రెడ్ బుక్ రాజ్యాంగం నడుస్తోంది

*(మొదటి పేజి తరువాయి)*

అలాగే ఆళ్లగడ్డ వైఎస్సార్సీపీ నాయకుడు భూమా కిషోర్రెడ్డి అనుచరుడైన చాకలి శ్రీనివాసులును తీవ్రంగా గాయపరిచిన ఘటనలో బాధితున్ని అతని కుటుంబ సభ్యులను పరామర్శించి అండగా ఉంటామని తెలిపారు. అనంతరం వైఎస్సార్సీపీ నాయకుడు నారపురెడ్డిని కలిసి ధైర్యం ఇచ్చారు. కార్యక్రమంలో మాజీ మంత్రి బుగ్గన రాంజేంద్రనాథరెడ్డి, నంద్యాల జిల్లా వైఎస్సార్సీపీ అధ్యక్షుడు మాజీ ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్రెడ్డి, మాజీ ఎంపీ పోచా బ్రహ్మానందరెడ్డి, ఎమ్మెల్సీ ఇసాక్బాష, ఎమ్మెల్సీ రామసుబ్బారెడ్డి, జెడ్పీటీసీ ఎర్రబోతుల పాపిరెడ్డి, మాజీ ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి, శిల్పా రవిచంద్రకిషోర్ రెడ్డి, కాటసాని రామిరెడ్డి, గంగుల బిజేంద్రనాథరెడ్డి, మాజీ ఎమ్మెల్సీ గంగుల ప్రభాకర్ రెడ్డి ,ఎస్వీ మోహన్ రెడ్డి, కంగాటి శ్రీదేవి, నంద్యాల మున్సిపల్ చైర్పర్సన్ మాబున్నీసా, వైఎస్సార్సీపీ రాష్ట్ర సోషల్ మీడియా కన్వీనర్ పీపీ మధు సూధన్ రెడ్డి, శిల్పా భువనేశ్వర్ రెడ్డి భూమా కిషోర్ రెడ్డి, ఆదిరెడ్డి, వైఎస్సార్సీపీ రాష్ట్ర మహిళా ఉపాధ్యక్షురాలు డా.శశికళారెడ్డి, వైఎస్సార్సీపీ ఉమెన్ రీజనల్ కోఆర్డినేటర్ గాజుల శ్వేతారెడ్డి, స్థానిక వైఎస్సార్సీపీ నాయకులు పాల్గొన్నారు.



మీడియా సమావేశంలో మాజీ సీఎం జగన్ మోహన్ రెడ్డి మాట్లాడుతూ.. సీతారాంపురం గ్రామంలో టీడీపీ నాయకులు తమ ఆదిపత్యం కోసం వైఎస్సార్సీపీకి మద్దతు తెలిపిన సుబ్బరాయుడును, నారపురెడ్డి, పెద్దిరెడ్డి, మరి కొందరిని హత్యచేయాలని పథకం పన్ని పెద్ద సుబ్బరాయుడిని అత్యంత దారుణంగా రాడ్లు, కత్తులతో దాడి చేసి హత్యగావించడం ఎంతో బాధాకరం అన్నారు. అయితే గ్రామంలో ఉద్రిక్త వాతావరణం ఉందని ఘర్షణ వాతావరణం ఉందని తెలిసినా అదనపు పోలీస్ భలగాలను ఎందుకు పంపలేదో చెప్పాలన్నారు. ఈ ఘటన చంద్రబాబు, లోకేష్, స్థానిక ఎమ్మెల్యే అండదండలతో స్థానిక టీడీపీ నాయకుడు బుడ్డారెడ్డి శ్రీనివాసరెడ్డి సాక్షత్తు ఎస్ఐ సమక్ష్యంలో సుబ్బరాయుడును హతమార్చడం, అడ్డువచ్చిన సుబ్బరాయుడు భార్య సుబ్బమ్మపై దాడి చేసి గాయపరిచారన్నారు. హత్య చేసిన వారిపై మరియు చేయించిన వారిపై కేసులు ఎందుకు పెట్టలేదో పోలీసు అధికారులు చెప్పాలన్నారు. హత్య జరుగకముందు జరిగిన తర్వాత బుడ్డారెడ్డి శ్రీనివాసరెడ్డి ఎమ్మెల్యేకు ఫోన్లు చేయలేదా?...వారి కాల్ రికార్డులు పరిశీలించాలన్నారు. రాష్ట్రంలో జరుగుతున్న ఘటనల్లో అన్నీ ఇలాగే జరిగాయన్నారు. రాష్ట్రంలో లా అండ్ ఆర్డర్ పూర్తిగా క్షీణించిన పరిస్థితి నెలకొన్నదన్నారు. నాయ్య స్థానంలో బాధితుల పక్షాన పోరాటం చేస్తానని బాధితుల పక్షాన అండగా నిలుస్తామని చెప్పారు. వీరందరికి గ్రామాల్లో స్వేచ్ఛగా ఉండేందుకు పోలీసులు రక్షణ కల్పించేలా న్యాయస్థానాల నుండి ఆదేశాలను తీసుకువచ్చేందుకు కృషిచేస్తామని తెలిపారు. ప్రజాస్వామ్యం కాడాల్సిన బాధ్యత ప్రభుత్వానిదని అన్నారు. టీడీపీ ప్రభుత్వం ఎన్నికలవేల ప్రజలకు ఇచ్చిన హామీలు నెరవేర్చాలన్న ఆలోచనలేకుండా గత రెండు నరనెల్లో టీడీపీ ప్రభుత్వంలో రాష్ట్రంలో అరాచక పాలన, మారణ హోమం సృష్టిస్తున్నారని తెలిపారు. చంద్రబాబు నాయుడు అనే వ్యక్తి ప్రజలకు మోసపు మాటలు చెప్పి ఓట్లు వేయించుకున్నాడని, హామీలు నెరవేర్చలేదని ప్రజలు ప్రశ్నిస్తారని రాష్ట్రంలో దాడులు, హత్యలు చేస్తూ ప్రక్కదారి పట్టించే కార్యక్రమం చేస్తున్నారని అన్నారు. రాష్ట్రంలో రెడ్ బుక్ పాలన సాగిస్తున్నారు. లోకేష్ రెడ్ బుక్ పాలనను రాష్ట్రంలోని అన్ని నియోజకవర్గాల్లో చేస్తున్నారన్నారు.

## ప్రతి గ్రామంలో స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించాలి.

*(మొదటి పేజి తరువాయి)*

2011 జనాభా ఆధారంగా 5 వేలులోపు జనాభా ఉన్న పంచాయతీలకు రూ.10 వేలు, 5వేలు పైబడి జనాభా ఉన్న పంచాయతీలకు రూ.25 వేలు అందిస్తారు. ఈ మొత్తంతో స్వాతంత్ర్య దినోత్సవం రోజున కార్యక్రమాలు నిర్వహించాలి. జనవరి 26న గణతంత్ర దినోత్సవ కార్యక్రమాలకు ఇదే విధంగా రూ.10 వేలు, రూ.25 వేలు చొప్పున నిధులు అందిస్తారు.

పవన్ కళ్యాణ్ ని ఇటీవల పలువురు సర్పంచులు కలిసిన సందర్భంలో- స్వాతంత్ర్య దినోత్సవం, రిపబ్లిక్ డే నిర్వహణ కూడా కష్టంగా ఉందని వాపోయారు. జెండా పండుగను ఘనంగా చేసేందుకు కూడా తగినన్ని నిధులు ఉండటం లేదని తెలిపారు. ఇందుకు సంబంధించి పంచాయతీలకు ఎంత మొత్తాలు ఇస్తున్నదీ తెలియచేయాలని పవన్ కళ్యాణ్ సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. గత 34 ఏళ్లుగా రూ.వంద, రూ.250 చొప్పునే అందిస్తున్నట్లు తెలిపారు. ఆ స్వల్ప మొత్తాలతో కార్యక్రమాల నిర్వహణ సాధ్యం కాదనీ, ఈ వేడుకలను పంచాయతీ సర్పంచులు, సిబ్బంది ఘనంగా చేపట్టాలంటే తగిన మొత్తం ఇవ్వాలని ఉప ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. ఆ మేరకు రూ.10 వేలు, రూ.25 వేలు నిర్ణయించారు.

పంచాయతీల అధ్వర్యంలో ఆగస్టు 15, జనవరి 26 నాటి కార్యక్రమాలు ఏ విధంగా చేయాలో కూడా మార్గదర్శకాలు నిర్దేశించారు. జాతీయ వేడుకలైన స్వాతంత్ర్య దినోత్సవం, గణతంత్ర దినోత్సవాల విశిష్టత ఉట్టిపడేలా కార్యక్రమాల నిర్వహణ ఉండాలి. పంచాయతీ పరిధిలో ఉన్న ప్రభుత్వ పాఠశాలలు, ప్రైవేట్ పాఠశాల విద్యార్థులకు ఆగస్టు 15 విశిష్టత, రాజ్యాంగ విలువ, స్థానిక సంస్థల పాలన లాంటి అంశాలపై వ్యాస రచన, క్విజ్, డిబేట్ లాంటి పోటీలు నిర్వహించాలి. ఆటల పోటీలు నిర్వహించాలి. ఈ పోటీల నిర్వహణలో సంబంధిత పాఠశాలల ఉపాధ్యాయులను భాగస్వాములను చేయాలి. బహుమతులు అందించాలి. పంచాయతీ పరిధిలోని స్వతంత్ర సమరయోధులు, రక్షణ రంగం నుంచి వచ్చివారినీ, పారిశుధ్య కార్మికులను సత్కరించాలి. పాఠశాలలు, అంగన్వాడీల్లోని పిల్లలకు మిఠాయిలు/చాక్లెట్లు అందించాలి. పారిశుధ్యంపై మహాత్మా గాంధీజీ చెప్పిన మాటలతో ప్రమాణం చేయించాలి.

## రాజకీయ లబ్ది కోసమే వైసీపీ నీచ రాజకీయం.!

### -రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డా. డోలా శ్రీ బాల వీరాంజనేయ స్వామి.

ఆంధ్ర ప్రగతి అమరావతి ఆగస్టు 09:
విజయవాడలో అంబేద్కర్ విగ్రహానికి ఉన్న జగన్ పేరును ఎవరో ఆగంతకులు తొలగిస్తే... నానా యాగీ చేస్తున్న వైసీపీ నేతలు నాడు విదేశీ విద్యకు అంబేద్కర్ పేరు మార్చి జగన్ తన పేరు పెట్టుకుంటే ఎందుకు నోరు మెదపలేదని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డా. డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి మండిపడ్డారు. శుక్రవారం నాడు ఆయన ఒంగోలు పట్టణంలో విలేకరులతో మాట్లాడుతూ....విజయవాడలో అంబేద్కర్ విగ్రహానికి ఉన్న జగన్ పేరును అర్ధరాత్రి ఎవరో ఆగంతకులు తొలగిస్తే వైసీపీ నేతలు సిగ్గులేకుండా నానా యాగీ చేస్తున్నారు. కానీ నాడు విదేశీ విద్యకు అంబేద్కర్ పేరు తొలగించి జగన్ తన పేరు పెట్టుకుంటే వైసీపీ దళిత నేతలు ఎందుకు నోరు మెదపలేదు? అంబేద్కర్ విగ్రహంపై చిన్న గీత కూడా పడలేదు. కానీ అంబేద్కర్ విగ్రహం ధ్వంసం చేస్తున్నారంటూ తప్పుడు ప్రచారం చేయటం సిగ్గుచేటు. దీన్ని ప్రభుత్వానికి ఆపాదించటం సరికాదు. దీనికి ప్రభుత్వానికి ఎటువంటి సంబందం లేదు. ప్రభుత్వంపై బురద చల్లే పనులు మానుకోవాలి. ప్రభుత్వం ఎవరి పేరు తొలగించలేదు. మేం అలాంటి పనులు చేయాల్సిన అవసరం మాకు లేదు. వైసీపీలో దళిత మంత్రులు 5 ఏళ్లు అధికారంలో ఉండి ఎప్పుడూ జగన్ మెప్పు కోసం పాకులాడటం తప్ప దళితులకు చేసిందేంటి? నాడు సాంఘిక సంక్షేమ శాఖ మంత్రిగా పనిచేసిన మేరుగ నాగార్జున, విద్యాశాఖ మంత్రిగా పనిచేసిన ఆదిమూలపు సురేష్ ఏం ఒరగబెట్టారు? ప్రభుత్వ పాఠశాలలు, వసతి గృహాలు అధ్వానంగా ఉన్నాయి. విద్యార్థులకు కనీస సౌకర్యాలు కల్పించలేకపోయారు. జాతి ప్రయోజనాలు పక్కన పెట్టి రాజకీయ ప్రయోజనాల కోసం పాకులాడే వారిని జాతి క్షమించదు. జగన్ ఎస్సీ కార్పోరేషన్ నిర్వీర్యం చేశారు. ఫీజు రీయంబర్స్ మెంట్ బకాయిలు పెట్టారు. దళితుల్ని, గిరిజనుల్ని జగన్ దారుణంగా మోసం చేశారని మంత్రి విమర్శించారు.

ప్రతి అక్షరం ప్రజాహితం
ఆంధ్రప్రగతి
తెలుగు దినపత్రిక
శనివారం 10 ఆగస్టు 2024

# ఘనంగా ప్రపంచ ఆదివాసీ దినోత్సవ వేడుకలు

## -గిరిజన సమస్యలను ప్రాధాన్యతా క్రమంలో పరిష్కరిస్తాం.

ఆంధ్ర ప్రగతి నంద్యాల, ఆగస్టు 09:
ప్రకృతికి దగ్గరగా జీవిస్తున్న చెంచు, సుగాలి, ఎరుకల, యానాది తదితర జాతుల జీవన ప్రమాణాలు పెంపొందించేందుకు కలిసికట్టుగా కృషి చేద్దామని జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా పిలుపునిచ్చారు. శుక్రవారం కలెక్టరేట్లోని సెంటినరీ హాల్లో ప్రపంచ ఆదివాసి దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి ఈ వేడుకల్లో జిల్లా కలెక్టర్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ వేడుకల్లో గిరిజన ప్రజా సమాఖ్య రాష్ట్ర అధ్యక్షులు రాజు నాయక్, ఆల్ ఇండియా బంజారా సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షులు వెంకటరమణ నాయక్, ఎస్టీసెల్ అధికార ప్రతినిధి స్వామి నాయక్, రాష్ట్ర యువజన వర్కింగ్ ప్రెసిడెంట్ బాలనాయక్, ఆల్ ఇండియా బంజారా సేవా సంఘం నాయకులు శ్రీనివాస్ నాయక్, దాసు నాయక్, ఎస్ రామచంద్రుడు, జవహర్ నాయక్, గోపాల్ నాయక్, చిటికెల సలోమి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి మాట్లాడుతూ చెంచు, సుగాలి, యానాది, ఎరుకల తదితర జాతుల జీవన ప్రమాణాల పెంపుదలకు అందరం కలిసికట్టుగా ఉమ్మడి ప్రయత్నం చేయాలన్నారు. ఆదివాసుల హక్కుల పరిరక్షణ కోసం 1994 సంవత్సరంలో ఐక్యరాజ్యసమితి ప్రతి సంవత్సరం ఆగస్టు 9న ప్రపంచవ్యాప్తంగా ఆదివాసుల దినోత్సవం జరుపుకోవాలని సూచించిందన్నారు. జిల్లాలో 49 గిరిజన ప్రాంతాల్లో ఉన్న తల్లిదండ్రులందరూ తమ పిల్లల్ని పాఠశాలలకు పంపించేలా ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. పిల్లల



నైపుణ్యాన్ని బట్టి ఉపాధ్యాయులు విద్యాబుద్ధులు నేర్పించాలన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో ప్రభుత్వం నిర్దేశించిన మెనూ ప్రకారం పోషక విలువలతో కూడిన ఆహార పదార్థాలు అందిస్తున్నామన్నారు. ఎనిమిదో తరగతి అనంతరం పై చదువులు చదివేందుకు ఆడపిల్లలను పంపకుండా పెళ్లిళ్లు చేసే సంప్రదాయానికి స్వస్తి పలకాలన్నారు. మగ పిల్లలను ఆడపిల్లలను సమదృష్టితో చూసి సమాన అవకాశాలు కల్పించాలని కలెక్టర్ ఈ సందర్భంగా కోరారు. పోటీ పరీక్షలలో పాల్గొనే విద్యార్థులకు స్టడీ సెంటర్ ఏర్పాటుకు కృషి చేస్తామన్నారు. గిరిజన ప్రాంతాలలోని ఆరోగ్య కేంద్రాలలో డాక్టర్లు అందుబాటులో ఉండి మెరుగైన వైద్య సేవలు అందించేలా ఆదేశాలు జారీ చేశామన్నారు. వైద్య పరంగా ఉన్న సమస్యలన్నిటిని పరిష్కరించేందుకు కృషి చేస్తామన్నారు. గిరిజన ప్రాంతాల ప్రజల జీవనోపాదుల మెరుగుదలకు అవసరమైన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ తెలిపారు. ఆర్వోఎఫ్ఆర్ కింద పంపిణీ చేసిన భూముల్లో కొంతమంది పంటలు



వేసుకోవడం లేదని వీటినన్నిటిని వినియోగంలోకి తెచ్చేందుకు ప్రత్యేక ప్రణాళిక రూపొందిస్తామన్నారు. ఐటీడీఏ, సంక్షేమ హాస్టల్లోని సమస్యలను ఒక్కొక్కటిగా పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను పకడ్బందీగా అమలు చేసేందుకు కృషి చేస్తామన్నారు. సంఘ నాయకులు వివరించిన సమస్యలన్నీ నోట్ చేసుకున్నామని వాటన్నిటిని నిశితంగా పరిశీలించి ప్రాధాన్యత క్రమంలో పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. పిల్లలు మాదకద్రవ్యాలకు అలవాటు పడి బానిస కాకుండా తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. తొలుత మహానంది, అహోబిలం, పాణ్యం ఆశ్రమ పాఠశాలల విద్యార్థులు చక్కటి నృత్య ప్రదర్శన ప్రదర్శించారని మరిన్ని మెళుకువలు నేర్చుకొని అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు తెచ్చే విధంగా ప్రదర్శనలు ఇవ్వాలని కలెక్టర్ ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో జిల్లా గిరిజన సంక్షేమ అధికారి శివప్రసాద్, అన్ని కుల సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# ఉచిత పాఠ్య పుస్తకాలు పంపిణీ చేసిన మంత్రి ఎన్ఎండి ఫరూక్, ఫిరోజ్.





ఆంధ్ర ప్రగతి నంద్యాల ఆగస్టు 09:
నంద్యాల పట్టణంలోని ఎస్ వై వి సి పి ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల నందు డిఐఈఓ సునీత , కాలేజీ ప్రిన్సిపాల్ సోమశేఖరప్ప , ఉర్దూ గర్ల్స్ జూనియర్ కాలేజ్ ప్రిన్సిపల్ కరిముల్లా ఆధ్వర్యంలో నంద్యాల ప్రభుత్వ బాలికల కళాశాల నందు నిర్వహించిన ఉచిత పాఠ్య పుస్తకాలు మరియు నోటుబుక్కులు పంపిణీ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర న్యాయశాఖ మరియు మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రివర్యులు ఎన్ఎండి ఫరూక్, నంద్యాల టిడిపి జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్ఎండి ఫిరోజ్ పాల్గొని పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రివర్యులు ఎన్ఎండి ఫరూక్ మాట్లాడుతూ విద్యార్థినిలు బాగా చదువుకొని అన్ని రంగాలలో రాణించాలని వారికి కావాల్సిన సౌకర్యాలు ప్రభుత్వం తరపున ఏర్పాటు చేస్తామని తెలియజేశారు . మన చదువు ఉన్న స్థాయి నుంచి ఉన్నత స్థాయికి చేరుస్తుందని ప్రతి ఒక్కరు ఒక టార్గెట్ ను పెట్టుకుని చదువుకొని మంచి స్థాయిలో ఉండాలని చదువు చెప్పిన ఉపాధ్యాయులకు అలాగే తల్లిదండ్రులకు సమాజానికి మంచి పేరు తీసుకురావాలని కోరారు. అనంతరం అధ్యాపకులు ఫరూక్ కి మంచినీళ్లు సరిగ్గా రావడంలేదని తెలియజేయడంతో వెంటనే మున్సిపల్ కమిషనర్ కి మంత్రిగారు ఫోన్ చేసి మున్సిపల్ కొళాయిని ఏర్పాటు చేయాలని తెలియజేశారు అలాగే విద్యార్థినిలు మాకు కంప్యూటర్ అలాగే టైప్ కావాలని కోరగా కచ్చితంగా ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. అనంతరం అధ్యాపకుల బృందం మంత్రి ఫరూక్ ని ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో కాలేజీ అధ్యాపకులు టిడిపి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# సినీ హీరో మహేష్ బాబు పుట్టినరోజు వేడుకల్లో పాల్గొన్న ఎన్ఎండి ఫిరోజ్.






ఆంధ్ర ప్రగతి నంద్యాల ఆగస్టు 09:
ప్రముఖ సినీ నటుడు సూపర్ స్టార్ మహేష్ బాబు పుట్టినరోజు సందర్భంగా నంద్యాల జిల్లా మహేష్ బాబు ఫ్యాన్స్ అధ్యక్షులు ఈపూరి రాజశేఖర్ మరియు నంద్యాల అభిమానుల ఆధ్వర్యంలో నిర్వహించిన వివిధ సేవ కార్యక్రమాల్లో ముఖ్య అతిధిగా ఎన్ ఎండి ఫిరోజ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎన్ఎండి ఫిరోజ్ మాట్లాడుతూ.. ఆంధ్రప్రదేశ్ లోని 2 గ్రామాలను దత్తత తీసుకోని ఎంతో అభివృద్ధి చేసారని, ఎంతో మంది చిన్నారులకు కోట్లాది రూపాయలు ఖర్చు చేసి ఆపరేషన్లు చేయించిన గొప్ప మనిషి మహేష్ బాబు అని తెలిపారు ఇలాగే మరెన్నో మంచి సేవ కార్యక్రమాలు చేస్తూ మహేష్ బాబు వారి అభిమానులు ప్రజల ఆశీస్సులు పొందాలని పిలుపునిచ్చారు. అనంతరం ఎన్ఎండి ఫిరోజ్ చేతులా మీదుగా జిల్లా ప్రభుత్వ ఆసుపత్రి నందు అన్నదానం చేయడం జరిగింది.

# అబ్బి పురం గిరిజన కాలనీ ఐటిడిఏ లో చేర్చి అభివృద్ధి చేయాలి.

ఆంధ్ర ప్రగతి మహానంది ఆగస్టు 09:
ఆదివాసి దినోత్సవ సందర్భంగా ప్రభుత్వాలు వేల కోట్ల రూపాయలు ఖర్చుపెట్టి ఘనంగా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు తప్ప ఆదివాసుల పడుతున్న వస్తున్న ఇబ్బందులను అవస్థలను పట్టించుకోవడంలో పూర్తిగా వైఫల్యం చెందారని సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి. ఎస్. బాబా ఫక్రుద్దీన్. ఆంధ్రప్రదేశ్ గిరిజన సమాఖ్య జిల్లా ప్రధాన కార్యదర్శిమోటారాముడు. సిపిఐ మండల కార్యదర్శి ఆర్ సామేలు. విమర్శించారు.

మహానంది మండలం అబ్బిపురం గ్రామంలో కురిసిన వర్షాల వల్ల వారు వేసుకున్న గుడిసెలు కూలిపోవడంతో పరిశీలిస్తున్న సిపిఐ జిల్లా ప్రతినిధి బృందం.

ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి ఎస్ బాబా ఫకృద్దీన్ సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు. ఆంధ్రప్రదేశ్ గిరిజన సమాఖ్య జిల్లా ప్రధాన కార్యదర్శి మోటారాముడు సిపిఐ మండల కార్యదర్శి. ఆర్ సామేలు. గిరిజన సమాఖ్య జిల్లా నాయకుడు



తుపాకుల వెంకటేశ్వర్లు. స్థానిక నాయకులు. లక్ష్మయ్య. అంజి రవి. కిరణ్. రాజు. గిరిజనులు లక్ష్మీదేవి. సువార్తమ్మ. దానమ్మ ఎల్లమ్మ. తదితరులు పాల్గొన్నారు.

ఈ సందర్భంగా పై నాయకులు మాట్లాడుతూ. మహానంది మండలం అబ్బిపురం గ్రామంలో 42 కుటుంబాల. గిరిజనులు దుర్భరమైన జీవితాలతో గడుపుతున్నారని వారిని ఆదుకోవడంలో ప్రభుత్వ యంత్రాంగం పూర్తిగా వైఫల్యం చెందిందని విమర్శించారు.

అబ్బిపురం గ్రామానికి రోడ్డు నిర్మాణము వీదికలువలు. మరుగుదొడ్లు గృహ నిర్మామాలు ఏర్పాటు చేయాలని ప్రభుత్వ అధికారులకు అధికార పార్టీ నాయకులు ఎన్నోసార్లు విన్నవించినా చెవుటోడి ముందర శంఖం ఊదినట్టే వ్యవరించడము దుర్మార్గమని జిల్లా ఐటీడీఏ అధికారులు అబ్బి పురం గ్రామాన్ని ఇంతవరకు సందర్శించకపోవడం విచారకరమని గ్రామంలో మగవారు అడవికిపోక పోవడం వల్ల అర్ధాకిలితో జీవిస్తున్నారని ప్రభుత్వ అధికారులు వారికి మూడు ఎకరాల ప్రభుత్వ భూమిని కేటాయించడంతో పనులు చేసుకుని బతుకుతారని జిల్లా కలెక్టర్ అబ్బిపురం గిరిజన గ్రామాన్ని సందర్శించి ఐ టి డి ఎ లో చేర్చి వారు పడుతున్న ఇబ్బందులను గుర్తించి వారికి గృహ నిర్మాణాలు..రోడ్డు నిర్మాణం. వీధికాలువలు వీధిలైట్లు మరుగుదొడ్లు నిర్మాణం చేపట్టి ఆదుకోవాలని పై నాయకులు డిమాండ్ చేశారు.

# గోమాతతో సకలైశ్వర్యాలు.

## -డాక్టర్ మల్లు వేంకటరెడ్డి, తితిదే

ఆంధ్ర ప్రగతి ఆళ్ళగడ్డ ఆగస్టు 09:
గోమాతతో సకలైశ్వర్యాలు సిద్ధిస్తాయని, అటువంటి గోమాతను సంరక్షణకు అందరూ కృషి చేయాలని తిరుమల తిరుపతి దేవస్థానములు హిందూ ధర్మ ప్రచార పరిషత్ ఉమ్మడి కర్నూలు జిల్లా శాఖ కార్యనిర్వాహకులు డాక్టర్ మల్లు వేంకటరెడ్డి అన్నారు. తిరుమల తిరుపతి దేవస్థానములు హిందూ ధర్మ ప్రచార పరిషత్ ఆధ్వర్యంలో గత నాలుగు రోజులుగా నంద్యాల జిల్లా, ఆళ్ళగడ్డ



మండలం, బత్తలూరు గ్రామంలోని శ్రీ లక్ష్మీ చెన్నకేశవ స్వామి దేవస్థానం నందు జరుగుతున్న ధార్మిక, ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాల ముగింపు సందర్భంగా గోపూజ మరియు కుంకుమార్చన కార్యక్రమాలు నిర్వహించారు. నాలుగు రోజులుగా గీతా ప్రచారకులు యం.మద్దయ్య స్వామి శ్రీమద్రామాయణం, మహాభారతం , భగవద్గీతలపై చేసిన ధార్మిక ప్రవచనాలు భక్తులను ఎంతగానో అలరించాయి. ఈ కార్యక్రమంలో ఆలయ నిర్వాహకులు పల్లె చిన్న వెంకట సుబ్బారెడ్డి, భజన మండలి సభ్యులు బచ్చు పుల్లారెడ్డి, ఇరిగెల రవీంద్రారెడ్డి, అంబటి రామచంద్రా రెడ్డి, మాడిగం వెంకట సుబ్బారెడ్డి, ఇరిగెల ప్రసాద్ రెడ్డి, పి.నాగశంకర్, బి.మహేశ్వర రెడ్డి, బచ్చు సావిత్రమ్మ, సుజాతమ్మ, లక్ష్మీదేవి, జయమ్మతో పాటు గ్రామ భక్త మండలి సభ్యులు పాల్గొన్నారు.

# మీ కుటుంబ చరిత్ర అంతా రక్త చరిత్రే.!

**-దేశంలోనే నెం.1 క్రిమినల్ లీడర్ వైఎస్ జగన్. -సిబిఐ కోర్టుకు వెళ్లకుండా ఉండేందుకే ప్రతి శుక్రవారం ఒక కార్యక్రమం.**

## -జగన్ పై మంత్రులు, ఎమ్మెల్యేల ఫైర్.

ఆంధ్ర ప్రగతి నంద్యాల ఆగస్టు 09:
మాజీ సీఎం జగన్ ఉద్దేశ్యంతో మీ కుటుంబ చరిత్ర అంతా రక్త చరిత్రే అని,దేశంలోనే నెం.1 క్రిమినల్ లీడర్వైఎస్ జగన్ అని నేషనల్ మీడియా చెప్తోందని, సిబిఐ కోర్టుకు వెళ్లకుండా ఉండేందుకే ప్రతి శుక్రవారం ఏదో ఒక కార్యక్రమాన్ని జగన్ ఏర్పాటు చేసుకుంటున్నాడని రాష్ట్ర మంత్రులు ఎన్ఎండి ఫరూక్, బిసి జనార్ధన్ రెడ్డి, ఎంపీ బైరెడ్డి శబరి , ఎమ్మెల్యేలు భూమా అఖిలప్రియ, బుడ్డా రాజశేఖర్ రెడ్డి , గిత్త జయసూర్య , టిడిపి జిల్లా అధ్యక్షులు మల్లెల రాజశేఖర్ లు విమర్శించారు.

నంద్యాలలోని టిడిపి జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో మంత్రులు ఎన్ఎండి ఫరూక్, బీసీ జనార్ధన్ రెడ్డి, ఎంపీ బైరెడ్డి శబరి , ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ , బుడ్డా రాజశేఖర్ రెడ్డి , గిత్త జయసూర్య జగన్ పై విరుచుకుపడ్డారు.

మంత్రి ఎన్ఎండీ ఫరూక్ మాట్లాడుతూ కక్ష సాధింపు చర్యలకు, హత్యా రాజకీయాలకు దూరంగా ఉండాలని ముఖ్యమంత్రి చంద్రబాబు తమకు క్లియర్గా చెప్పారన్నారు. జగన్ ఇకనైనా హత్యా రాజకీయాలపై మాట్లాడటం మానుకోవాలని, రాష్ట్ర అభివృద్ధి గురించి మాట్లాడితే బాగుంటుందని మంత్రి ఫరూక్ హితవు చెప్పారు.

మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో హత్యా రాజకీయాలు జరుగుతున్నాయని జగన్ మాట్లాడటం దెయ్యాలు వేదాలు వల్లిస్తున్నట్లుగా ఉన్నాయన్నారు. జగన్ పాలనలో 2,686 హత్యలు జరిగాయని, ఆయనపై కూడా కేసులు పెట్టాలన్నారు. 'మీ కుటుంబ చరిత్ర అంతా రక్త



చరిత్రే' అని జగన్పై మంత్రి ఘాటైన వ్యాఖ్యలు చేశారు. సీతారామాపురంలో రెండు పార్టీల మధ్య గొడవ జరగలేదని, రెండు కుటుంబాల మధ్య గొడవ జరిగిందన్నారు.

ఎంపీ బైరెడ్డి శబరి మాట్లాడుతూ జగన్ మాట్లాడుతుంటే దయలు వేదాలు వల్లిస్తున్నట్లు ఉందని, బాబాయ్ హత్య జరిగినా రక్త చరిత్ర అని టిడిపి పై ఆరోపించారని, బాబు, లోకేష్ ను విమర్శించే హక్కు జగన్ కు లేదన్నారు. డాక్టర్ సుధాకర్, అబ్దుల్ సలాం కుటుంబం చనిపోతే ఎందుకు రాలేదని నిలదీశారు. మాటకు రెడ్ బుక్ ఒకటే కనిపిస్తుంది, ఇంకా రెడ్ బుక్ తెరవలేదని ఎంపి బైరెడ్డి శబరి పేర్కొన్నారు. ఆళ్లగడ్డ ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ మాట్లాడుతూ కుటుంబాల మధ్య జరిగిన ఘర్షణ వల్లే మర్డర్ జరిగిందన్నారు. జగన్ ఇకనైనా శవ రాజకీయాలు మానుకోవాలని హితవు చెప్పారు. నంద్యాలలో కానిస్టేబుల్ సురేంద్ర మర్డర్, అబ్దుల్ సలాం సూసైడ్ ఘటనలు జరిగినప్పుడు జగన్ నంద్యాలకు ఎందుకు రాలేదు? అని అఖిలప్రియ ప్రశ్నించారు. నంద్యాల శిల్పా వెంచర్లో ఓ మైనర్ బాలికపై అత్యాచారం చేసి హత్య




చేస్తే జగన్ ఎందుకు స్పందించలేదన్నారు.

శ్రీశైలం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్ రెడ్డి మాట్లాడుతూ జగన్ చుట్టూ ఉన్న నాయకులు మైండ్ క్రిమినల్ మైండ్ అని శవ రాజకీయాలు చేయడంలో వారికి సాటి ఎవరూ లేరని వారి పార్టీ పుట్టిందే శవ రాజకీయాల పైన అని వైఎస్ఆర్సిపి నాయకులపై విరుచుకుపడ్డాడు . ఎవరికీ భయపడే ప్రసక్తి లేదని ఇక్కడ ఉండేది బుడ్డా రాజశేఖర్ రెడ్డి అని హెచ్చరించారు . మా కుటుంబం రాజకీయాల్లో 50 సంవత్సరాల నుంచి ఉందని ఏ విషయం చర్చించడానికి అయినా మేము రెడీ అని సవాలు విసిరారు. నందికొట్కూరు ఎమ్మెల్యే గీతా జయసూర్య మాట్లాడుతూ రాజకీయాలు అంటే హుందాగా చేయాలే తప్ప ఇలా శవ రాజకీయాలు చేయకూడదని భవిష్యత్తులో జగన్ అరాచకాలని బయటకు తీస్తామని వారు వెంట తిరిగే నాయకులు ఎవరైతే తప్పు చేసి ఉంటారో వారిని కచ్చితంగా చట్టం శిక్షిస్తుందని తెలియజేశారు.

ఈ సమావేశంలో టిడిపి జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్ఎండి ఫిరోజ్ , రాష్ట్ర కార్యదర్శి తులసిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# నంద్యాల బిజెపి కార్యాలయంలో హర్ ఘర్ తిరంగా కార్యక్రమం



ఆంధ్ర ప్రగతి నంద్యాల ఆగస్టు 09: నంద్యాలలోని భారతీయ జనతా పార్టీ కార్యాలయంలో " హర్ ఘర్ తిరంగా అభియాన్" కార్యక్రమాన్ని జిల్లా కోఆర్డినేటర్ డాక్టర్ అభిరుచి మధు ఆధ్వర్యంలో నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి "హర్ ఘర్ తి రంగ అభియాన్ " రాయలసీమ జోనల్ కోఆర్డినేటర్ కాపు రామచంద్రారెడ్డి పాల్గొని, భారతీయ జనతా పార్టీ నాయకులకు కార్యకర్తలకు దిశా నిర్దేశం జరిగింది.

# నంద్యాల ప్రభుత్వ ఆసుపత్రిలో, వైద్య కళాశాలలో పనిచేస్తున్న శానిటేషన్ వర్కర్ల కు కనీస వేతనం ఇవ్వాలి




ఆంధ్ర ప్రగతి నంద్యాల ఆగస్టు 09: నంద్యాల జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలో మరియు నంద్యాల మెడికల్ కళాశాలలో పనిచేస్తున్న శానిటేషన్ వర్కర్స్ కు కనీస వేతనం అమలు చేయాలని వారికి ఈఎస్ఐ పిఎఫ్ ఈనెల స్లిప్పులు ఆనెలనే ఇవ్వాలని సిఐటియు జిల్లా అధ్యక్షులు ఏసురత్నం జిల్లా కార్యదర్శిలు కే ఎన్ డి గౌస్ వీ,బాల వెంకట్ డిమాండ్ చేశారు.నంద్యాల పట్టణంలోని సిఐటియు కార్యాలయంలో శానిటేషన్ వర్కర్స్ యూనియన్ సిఐటియు నాయకులు ప్రసాదు అధ్యక్షతన నంద్యాల ప్రభుత్వ ఆసుపత్రిలో మరియు వైద్య కళాశాలలో పనిచేస్తున్న శానిటేషన్ వర్కర్ల సమావేశం నిర్వహించడం జరిగింది ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా పాల్గొన్న పై నాయకులు మాట్లాడుతూ శానిటేషన్ వర్కర్ల సమస్యలు వెంటనే పరిష్కరించాలని 60 70 మంది పనిచేయవలసిన పనులు 40 మందితో మాత్రమే పనిచేయించుకుంటారని వర్కర్లకు పనిభారం భారీగా ఉందని వర్కర్లపై పని భారం తగ్గించేందుకు అవసరమైన వర్కర్లను విధుల్లోకి తీసుకోవాలని వారికి ఈ ఎస్ ఐ పి ఎఫ్ స్లిప్పులు ఏ నెలకి ఆ నెల ఇవ్వాలని డిమాండ్ చేశారు అనంతరం నంద్యాల ప్రభుత్వ ఆసుపత్రి మరియు మెడికల్ కళాశాలలో పనిచేస్తున్న శానిటేషన్ వర్కర్స్ యూనియన్ సిఐటియు నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది యూనియన్ గౌరవాధ్యక్షులుగా వి, బాల వెంకట్ గౌరవ సలహాదారులుగా ఏ, నాగరాజు అధ్యక్షులుగా చెన్నయ్య, కార్యదర్శిగా ప్రసాదు ఉపాధ్యక్షులుగా ఫాతిమా, సుగుణమ్మ, హరిప్రియ, ట్రెజరర్ గా గురుస్వామి సహాయ కార్యదర్శులుగా హరిప్రియ, లక్ష్మీ కుమారి, శ్రీనివాసులు, జ్యోతి, కమిటీ సభ్యులుగా పుల్లయ్య, సరస్వతి, రమణమ్మ, శివ లాలి, సింహాద్రిలను ఏకీభ్రంగా హుఎన్నుకున్నట్లు వారు తెలిపారు ఈ కార్యక్రమంలో నంద్యాల ప్రభుత్వాసుపత్రి మరియు మెడికల్ కళాశాల లో పనిచేసే శానిటేషన్ వర్కర్స్ పాల్గొన్నారు ఈ కార్యక్రమంలో సెక్యూరిటీ యూనియన్ నాయకులు చిన్నయ్య నాగన్న బాలయ్య తదితరులు పాల్గొన్నారు.

# రెడ్ క్రాస్ అవయవ దాన ప్రచార పోస్టర్లను ఆవిష్కరించిన జిల్లా కలెక్టర్.

**-జిల్లాలో అవయదానం చేసిన వారి వివరాలు ఈనెల 12లోగా రెడ్ క్రాస్ వారికి అందజేయండి.**

**-జిల్లా కలెక్టర్ మరియు రెడ్ క్రాస్ ప్రెసిడెంట్ శ్రీమతి జి.రాజకుమారి.**



ఆంధ్ర ప్రగతి నంద్యాల ఆగస్టు 09: ఈనెల 12వ తేదీలోగా నంద్యాల జిల్లాలో అవయవ దానము చేసిన వారి వివరాలు కుటుంబ సభ్యుల సమాచారము ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ వారికి అందజేయాలని రెడ్ క్రాస్ సొసైటీ జిల్లా ప్రెసిడెంట్ మరియు జిల్లా కలెక్టర్ శ్రీమతి జి రాజకుమారి ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 13న అంతర్జాతీయ అవయవదాన దినోత్సవం సందర్భంగా ఏర్పాటు చేయనున్న కార్యక్రమాల్లో భాగంగా జిల్లా కలెక్టర్ కార్యాలయంలో రెడ్ క్రాస్ వారు ముద్రించిన అవయవదాన ప్రచార పోస్టర్లను ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ గారు ఆవిష్కరించారుఈ కార్యక్రమంలో రెడ్ క్రాస్ జిల్లా చైర్మన్ దస్తగిరి పర్ల జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఇన్చార్జి అధికారి డాక్టర్ సాలాభాయి స్వచ్ఛంద సేవకురాలు స్వాతి రెడ్ క్రాస్ డిఎఫ్ఓ రాజు నాయక్ తదితరులు పాల్గొన్నారుఈ సందర్భంగా దస్తగిరి పర్ల మాట్లాడుతూ జిల్లాలో వైద్య కళాశాలలకు శరీర దానం చేసిన వారి కుటుంబ సభ్యులను అలాగే అవయవ దానం చేసిన వారి కుటుంబ సభ్యులను అంతర్జాతీయ అవయవదాన దినోత్సవం సందర్భంగా రెడ్ క్రాస్ ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్ చేతుల మీదుగా సన్మానించడం జరుగుతుందని కావున 8977750583 నంబర్కు వాట్సాప్ ద్వారా గాని, redcrossnandyala@gmail.com మెయిల్ ద్వారా గాని ఈనెల 12వ తేదీ ఉదయం 10 గంటల లోపల పంపాలని జిల్లాలోని స్వచ్ఛంద సంస్థల సంస్థలకు, ప్రజలకు మీడియా ద్వారా విజ్ఞప్తి చేశారు.

# నాణ్యమైన విద్యాబోధనతో ప్రభుత్వ స్కూళ్లపై నమ్మకం పెంచాలి.!

ఆంధ్ర ప్రగతి అమరావతి ఆగస్టు 09: నాణ్యమైన విద్యాబోధన ద్వారా ప్రభుత్వ పాఠశాలలపై ప్రజల్లో నమ్మకం పెంచాల్సి ఉందని రాష్ట్ర విద్య, ఐటి, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్ పేర్కొన్నారు. రాష్ట్రంలో ప్రపంచబ్యాంకు సహకారంతో అమలవుతున్న సపోర్టింగ్ ఆంధ్రాస్ లెర్నింగ్ ట్రాన్స్ ఫర్మేషన్ ప్రాజెక్టు అమలుతీరుపై పాఠశాల విద్య అధికారులు, సంబంధిత ఏజన్సీల ప్రతినిధులతో ఉండవల్లి నివాసంలో మంత్రి సమీక్షించారు. ఈ సందర్భంగా లోకేష్ మాట్లాడుతూ... గత ప్రభుత్వ హయాంలో సాల్ట్ ప్రాజెక్టు అమలులో వెనుకబడటంపై కారణాలను తెలుసుకున్నారు. నాడు-నేడు, సాల్ట్ వంటి పథకాలపై గత ప్రభుత్వం వేలకోట్లు ఖర్చుచేసినట్లు కాగితాల్లో చూపుతోందని, అదే నిజమైతే గత ఏడాది ప్రభుత్వ పాఠశాలల్లో 2లక్షలమంది విద్యార్థులు ఎందుకు తగ్గారని ప్రశ్నించారు. దీనిపై లోతైన విశ్లేషణ చేసి, నాణ్యమైన విద్య అందించి మెరుగైన ఫలితాల సాధనకు అధికారులు చిత్తశుద్ధితో పనిచేయాలని కోరారు. రాబోయే అయిదేళ్లలో ప్రైవేటు పాఠశాలలకు ధీటుగా ప్రభుత్వ స్కూళ్లను తీర్చిదిద్దడానికి అవసరమైన ప్రణాళికలు రూపొందించాలని అన్నారు. అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో ఇంటర్ నెట్ తప్పనిసరిగా ఉండేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రాథమిక పాఠశాలల స్థాయిలో ఎసెస్ మెంట్ మరింత శాస్త్రీయంగా ఉండేవిధంగా డిజైన్ లో మార్పులు చేయాలని ప్రథమ్ సంస్థ ప్రతినిధులకు సూచించారు. డిజిటలైజ్డ్ ఎసెస్ మెంట్ ను మరింత సమర్థవంతంగా నిర్వహించి ఆన్ లైన్ కు అనుసంధానించడంపై దృష్టిసారించాలని ఎడ్యుకేషనల్ ఇనిషియేటివ్స్ సంస్థను ఆదేశించారు. టీచింగ్ టూల్స్ అబ్జర్వేషన్, ఆబ్జెక్టివ్ ఓరియంటెడ్ బోధనాపద్ధతులను మెరుగుపర్చేందుకు చర్యలు తీసుకోవాలని లీడర్ షిప్ ఫర్ ఈక్విటీ (ఎల్ఎఫ్ఇ) ప్రతినిధులకు సూచించారు. ఆయా ఏజన్సీలు నిర్వహిస్తున్న ఎసెస్ మెంట్, శిక్షణా కార్యక్రమాలు అర్థవంతంగా, ఫలితాల మెరుగుదలకు దోహదపడేలా ఉండాలని అన్నారు. ఇంటర్మీడియట్ లో మార్కులకు బదులుగా గ్రేడింగ్ విధానాన్ని అమలుచేయడానికి గల అవకాశాలను పరిశీలించాలని సూచించారు. ముఖ్యమంత్రి నుంచి ఎమ్మెల్యే వరకు ప్రజాప్రతినిధులంతా మోడల్ పిటిఎం సమావేశాలకు హాజరై తల్లిదండ్రుల మనోగతాన్ని తెలుసుకుంటామని, ప్రభుత్వ పాఠశాలల మెరుగైన పనితీరు కోసం తల్లులను భాగస్వాములను చేయాలని అన్నారు. బాల్యం నుంచే మహిళలను గౌరవించేలా వచ్చే విద్యా సంవత్సరం నుంచి పాఠ్యాంశాల్లో మార్పులు చేయాలని మంత్రి లోకేష్ అధికారులను ఆదేశించారు. ఈ సమీక్షలో పాఠశాల విద్య ముఖ్య కార్యదర్శి కోన శశిధర్, డైరక్టర్ విజయరామరాజు, ఇంటర్మీడియట్ విద్య డైరక్టర్ కృతికా శుక్లా, సమగ్ర శిక్ష రాష్ట్ర ప్రాజెక్టు డైరక్టర్ బి.శ్రీనివాసరావు, పిడబ్ల్యుసి ప్రతినిధులు సుచీంద్ర కుమార్, సోనాల్ శివగుండే, సునీత, కె.సురేష్ బాబు (ప్రథమ్), దత్తాత్రేయ, మజీద్ (ఎడ్యుకేషనల్ ఇనిషియేటివ్స్), వైభవ్ పాండే, నాగ సాయికృష్ణ(కైవల్య ఫౌండేషన్), సిద్దేష్ శర్మ (లీడర్ షిప్ ఫర్ ఈక్విటీ) తదితరులు పాల్గొన్నారు.

# కొత్త బస్సును ప్రారంభించిన మంత్రి ఫరూక్, ఎంపీ బైరెడ్డి శబరి.





ఆంధ్ర ప్రగతి నంద్యాల ఆగస్టు 09: ఆర్టీసి బస్సు ప్రయాణం సురక్షితమని, ప్రయాణికులు ఆర్ టీ సి బస్సు ల్లో ప్రయాణం చేయాలని మంత్రి ఎన్ఎండి ఫరూక్, ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి లు కోరారు.శుక్రవారం నంద్యాల ఆర్టీసీ బస్టాండ్ లో నూతన బస్సును ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర న్యాయశాఖ మరియు మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రివర్యులు ఎన్ఎండి ఫరూక్ మరియు నంద్యాల ఎంపీ బైరెడ్డి శబరి ఆర్టీసీ అధికారులు ప్రారంభించడం జరిగింది.ఈ సందర్భంగా మంత్రివర్యులు ఎన్ఎండి ఫరూక్ గారు మాట్లాడుతూ నంద్యాలకు నూతనంగా ఏర్పాటు చేసిన బస్సులను అందరూ సద్వినియోగం చేసుకోవాలని నంద్యాల జనాభా పెరగడం అదేవిధంగా తెలుగుదేశం ప్రభుత్వం రావడంతో కొంతమంది ప్రజలు వారి గ్రామాలకు బస్సులు కావాలని అదేవిధంగా విద్యార్థినీ విద్యార్థులు తమ ఊర్లకి బస్సులు కావాలని అడగడంతో ప్రభుత్వం నూతన బస్సులను ఏర్పాటు చేయడం జరిగిందని దీనిని అందరూ సద్వినియోగం చేసుకోవాలని వీలైనంత వరకు ఆర్టీసీ బస్సుల్లోనే ప్రయాణం చేయాలని కోరారు.ఈ సందర్భంగా ఎంపీ బైరెడ్డి శబరి మాట్లాడుతూ ఆగస్టు 15 వ తేది నుంచి మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రారంభిస్తున్నారని, ఇచ్చిన హామీని టీడీపీ ప్రభుత్వం అమలు చేయబోతోందన్నారు, నంద్యాల కు నూతన ఆర్టీసీ బస్సులను తెలుగుదేశం పార్టీ కేటాయించడం చాలా సంతోషంగా ఉందని ప్రజలు కోరిక మేరకే నూతన బస్సులను ఏర్పాటు చేసి వాటిని ప్రారంభించడం జరిగిందని ఇది ప్రజా ప్రభుత్వమని ప్రజల సమస్యలను తీర్చడంలో ముందుండే ప్రభుత్వం తెలుగుదేశం ప్రభుత్వమని తెలియజేశారు.ఈ కార్యక్రమంలో డిపిడిఓ రజియా సుల్తాన, అసిస్టెంట్ డిపో మేనేజర్ మద్దిలేటి నాయుడు, ఏఈ విజయకుమార్, నంద్యాల టిడిపి జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్ఎండి ఫిరోజ్ మరియు ఆర్టీసీ అధికారులు , టిడిపి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఎన్డీఏ ప్రజా వ్యతిరేక విధానాలను వ్యతిరేకించాలి



ఆంధ్ర ప్రగతి నందికొట్కూరు ఆగస్టు 09: ఎన్డీయే ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక, కార్పొరేట్ అనుకూల విధానాలకు వ్యతిరేకంగా కిషన్ మోర్చా దేశ వ్యాప్త పిలుపులో భాగంగా 9.వ తేదీన క్విట్ ఇండియా డే స్ఫూర్తితో "క్విట్ కార్పోరేట్"అనే నినాదంతో రైతు సంఘాల సమన్వయ సమితి, కార్మిక సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో నందికొట్కూర్ పట్టణ కేంద్రా కేంద్ర ప్రభుత్వ కార్యాలయం. బిఎస్ఎన్ఎల్ ఆఫీస్.ఎదుట నిరసన ధర్నా కార్యక్రమం రైతులు, కార్మికులు, వ్యవసాయ కార్మికులు, కౌలు రైతులు ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం ఆధ్వర్యంలో ధర్నా కార్యక్రమం. చేపట్టడం జరిగింది. ధర్నా చేసిన అనంతరం డిప్యూటీ తాసిల్దార్ సత్యనారాయణ కు వినతిపత్రం ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమానికి వికలాంగుల సంఘం అధ్యక్షులు నాగన్న కాటేపోగు.సోమన్న అధ్యక్షత వహించగా అనంతరం . రైతు సంఘం జిల్లా నాయకులు పిక్కిలి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. అధికారంలోకి రాగానే రైతుల ఆదాయం రెట్టింపు చేస్తానని, స్వామినాథన్ సిఫార్సుల ప్రకారం మద్దతు ధరల చట్టం చేస్తామని నమ్మించి అధికారంలోకి వచ్చిన మోడీ, వాటి అమలు చేయకపోగా, మొత్తం వ్యవసాయ రంగాన్ని కార్పొరేట్ కంపెనీలకు అప్పజెప్పేందుకు మూడు వ్యవసాయ నల్ల చట్టాలు చేసిందని, ఈ చట్టాలకు వ్యతిరేకంగా 13 నెలపాటు రైతులు అనేక నిర్బంధాలను ఎదుర్కొని పోరాటం చేసి చట్టాలను రద్దు చేయించగలిగారని, ఈ ఉద్యమ విరమణ సందర్భంగా రాతపూర్వకంగా ఇచ్చిన హామీలను తుంగలో తొక్కి, వ్యవసాయ రంగాన్ని కార్పొరేట్లకు కట్టబెట్టేందుకు విత్తన వ్యాపారం, క్రిమిసంహారక మందుల వ్యాపారం కార్పొరేట్లకు కట్టబెట్టింది. పంటల బీమాను ప్రైవేటు కంపెనీలకు ఆదాయ వనరుగా మార్చి, రైతులకు ప్రయోజనకరంగా ఉన్న సహకార సంఘాలను కేంద్ర పెత్తనంలోకి తీసుకొని ప్రైవేటు కంపెనీలకు వీలు కల్పించిందని,అదే విధంగా కార్పొరేట్ కంపెనీలపై విధించే పన్నులు 30 శాతం నుండి 20 శాతానికి తగ్గించి, రైతులు వినియోగించే పరికరాలపై 18 శాతం జీఎస్టీ విధించిందని, దీన్నిబట్టి ఈ ప్రభుత్వం ఎవరు పక్షమో తెలుస్తుంది అని అన్నారు. అదేవిధంగా ఏళ్ల తరబడి కార్మికుల పోరాడి సాధించుకున్నటువంటి చట్టాలు మొత్తాన్ని కూడా నిర్వీర్యం చేసి లేబర్ కోడ్ ల పేరుతో మరోసారి కార్మికులను బానిసలుగా మార్చే ప్రయత్నం చేస్తుందని అన్నారు. మరియు కమ్యూనిస్టుల మద్దతుతో యూపీఏ ప్రభుత్వంలో సాధించిన ఉపాధి హామీ చట్టాన్ని నీరుగార్చాలని చూడటం పేదల పొట్ట కొట్టడమే అన్నారు. సాగు రంగంలో కీలకపాత్ర పోషిస్తున్న కౌలు రైతులకు సంబంధించి, ఎటువంటి భరోసా కూడా ఈ ప్రభుత్వాల నుండి లభించడం లేదని అన్నారు. కావున కేంద్ర ప్రభుత్వం అనుసరించే ప్రజావ్యతిరేక, కార్పొరేట్ విధానాలకు వ్యతిరేకంగా రైతులు, కార్మికులు పాల్గొన్నారు.

# ఓర్వకల్లు ఇండస్ట్రియల్ హబ్‌లో పరిశ్రమల స్థాపనకు కృషి.!

**-రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్యం, ఫుడ్ ప్రాసెసింగ్ శాఖ మంత్రి టి.జి భరత్.**

**-పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరితా రెడ్డితో కలిసి ఓర్వకల్లు ఇండస్ట్రియల్ హబ్‌ను పరిశీలించిన మంత్రి భరత్.**

**-జయరాజ్ ఇస్పత్ స్టీల్ ఫ్యాక్టరీని సందర్శించి యాజమాన్యం, పరిశ్రమల శాఖ అధికారులతో మంత్రి సమావేశం.**






ఆంధ్ర ప్రగతి కర్నూలు జిల్లా ఆగస్టు 09: ఓర్వకల్లు ఇండస్ట్రియల్ హబ్‌లో పరిశ్రమల స్థాపనకు కృషి చేస్తున్నామని రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్యం, ఫుడ్ ప్రాసెసింగ్ శాఖ మంత్రి టి.జి భరత్ చెప్పారు. పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డితో కలిసి ఆయన ఓర్వకల్లు ఇండస్ట్రియల్ జోన్‌ను పరిశీలించారు. అంతకుముందు ఎయిర్‌పోర్టు సమీపంలో టిడిపి ప్రభుత్వ హయాంలో సీఎం చంద్రబాబు ఇండస్ట్రియల్ జోన్‌కు శంకుస్థాపన చేసిన ప్రాంతాన్ని మంత్రి పరిశీలించారు. కొందరు దుండగులు శిలాఫలకం ధ్వంసం చేయడాన్ని ఆయన ఖండించారు. ఆ తర్వాత ఇండస్ట్రియల్ జోన్‌కు వెళ్లి అధికారులతో మాట్లాడారు. నీరు, విద్యుత్, ఇతర మౌలిక సదుపాయాల కల్పనపై ఏపీఐఐసీ అధికారులతో చర్చించారు. అనంతరం జయరాజ్ ఇస్పత్ స్టీల్ ఫ్యాక్టరీని సందర్శించి ఫ్యాక్టరీ యాజమాన్యం, ఏపీఐఐసీ అధికారులతో సమీక్ష నిర్వహించారు. జయరాజ్ ఇస్పత్ స్టీల్ ఫ్యాక్టరీకి సంబంధించిన వివరాలను మంత్రి టి.జి భరత్, ఎమ్మెల్యే చరితారెడ్డికి ఫ్యాక్టరీ యాజమాన్యం పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు.అనంతరం మంత్రి టి.జి భరత్ మాట్లాడుతూ చంద్రబాబు నాయుడు సీఎం అవ్వడంతో ఇతర రాష్ట్రాలకు వెళ్లిపోయిన పరిశ్రమలు మళ్లీ ఏపీలో పెట్టుబడులు పెట్టేందుకు ఆసక్తిగా ఉన్నాయని తెలిపారు. గడిచిన ఐదేళ్లలో విధ్వంసం తప్ప జరిగిందేమీ లేదన్నారు. తమ టిడిపి ప్రభుత్వం అభివృద్ధే మంత్రంగా ముందుకు వెళుతోందని చెప్పారు. గత ప్రభుత్వ హయాంలో ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొన్న జయరాజ్ ఇస్పత్ స్టీల్ ఫ్యాక్టరీ యాజమాన్యం.. మళ్లీ టిడిపి ప్రభుత్వం రావడంతో ఇప్పుడున్న ఫ్యాక్టరీని మరింత విస్తరించేందుకు ముందుకొస్తోందని తెలిపారు. గడిచిన ఐదేళ్లలో ప్రభుత్వ సహకారం లేకపోవడంతో జయరాజ్ ఇస్పత్ స్టీల్ ఫ్యాక్టరీ నిర్మాణం నెమ్మదిగా సాగిందన్నారు. ప్రభుత్వం తరుపున ఫ్యాక్టరీకి అందించాల్సిన విద్యుత్, వాటర్, రైల్వే సైడింగ్స్ ఏదీ గత ప్రభుత్వం చేయలేదన్నారు. పారిశ్రామికవేత్తలందరితో చర్చలు జరుపుతున్నామని.. వేల కోట్ల పెట్టుబడులు పెట్టేందుకు వారందరూ ఆసక్తిగా ఉన్నట్లు మంత్రి టి.జి భరత్ తెలిపారు. గత ప్రభుత్వ హయాంలో ఏపీ నుండి వెళ్లిపోయిన ఓ పరిశ్రమ చెన్నైలో రూ.3 వేల కోట్లతో ప్లాంటును ఇప్పుడు నడుపుతుందని తెలిపారు. మళ్లీ మన రాష్ట్రానికి రావడానికి వాళ్లు ఆసక్తిగా ఉన్నారన్నారు. కేంద్ర ప్రభుత్వం సైతం ఓర్వకల్లు ఇండస్ట్రియల్ జోన్ లో మౌలిక సదుపాయాల కల్పనకు 1800 కోట్ల రూపాయలు ఇస్తున్నట్లు తెలిపారు. శ్రీసిటీ గ్రీన్ జోన్‌లో ఉందని, ఓర్వకల్లు రెడ్ జోన్‌లో ఉండటంతో ఎలాంటి పరిశ్రమలైనా ఇక్కడ ఏర్పాటుచేయొచ్చన్నారు. ఇలాంటి చోట మౌలిక సదుపాయాలు బాగా కల్పిస్తే ఓర్వకల్లులో పరిశ్రమలు భారీగా ఏర్పాటయ్యేందుకు అవకాశం ఉంటుందన్నారు. అందుకే బెస్ట్ కన్సల్టెన్సీతో మాట్లాడి ఇండస్ట్రియల్ జోన్లో సమస్యలేమైనా ఉంటే గుర్తించి సరిచేసుకుంటామన్నారు. జయరాజ్ ఇస్పత్ స్టీల్ ఫ్యాక్టరీ యాజమాన్యం సమస్యలను పరిష్కరిస్తామన్నారు. తమ ప్రభుత్వం మరో రెండు దశాబ్దాల పాటు కొనసాగుతుందని.. పారిశ్రామికవేత్తలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని భరోసా ఇస్తున్నామన్నారు. రాబోయే రోజుల్లో ఏపీని అభివృద్ధిలో ముందుకు తీసుకెళతామన్నారు. ఓర్వకల్లు ఇండస్ట్రియల్ జోన్లో పెట్టుబడులు ఊహించిన దానికంటే ఎక్కువగానే వస్తాయన్నారు. ఇక్కడ నీరు, విద్యుత్, రోడ్డు, రైల్వే లైన్ ఇతర సమస్యలన్నీ పరిష్కరిస్తామన్నారు. త్వరలోనే కర్నూలు నుండి విజయవాడకు విమాన సర్వీసులు ప్రారంభమవుతాయన్నారు.

అనంతరం ఎమ్మెల్యే గౌరు చరితా రెడ్డి మాట్లాడుతూ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఈ పారిశ్రామిక వాడను అభివృద్ధి చేసేందుకు అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నారని, ఇక్కడ అనేక పరిశ్రమలు నెలకొల్పడం ద్వారా ఈ గ్రామాలలోని యువతకు ఉద్యోగావకాశాలు కూడా కల్పించడం జరుగుతుందన్నారు.

ఈ కార్యక్రమంలో జయరాజ్ ఇస్పత్ స్టీల్ ఫ్యాక్టరీ ఎండి కొయాంక, కర్నూల్ ఆర్డీవో శేషిరెడ్డి, ఏపీఐఐసీ జోనల్ మేనేజర్ సోమశేఖర్ రెడ్డి, ఇండస్ట్రీస్ జీఎం మారుతి ప్రసాద్, ఓర్వకల్లు తహసిల్దార్ వెంకటరమణ, ఇండస్ట్రియల్ ఏఈ సందీప్, తదితరులు పాల్గొన్నారు.